# మనం





## నిజామాబాద్ కామారెడ్డి

బుధవారం । 22 । ఏప్రిల్ । 2026 పేజీలు: 7




# రైతులు పండించిన ప్రతి గింజ కొనుగోలు చేస్తున్నాం



- రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి.
- ఎల్లమ్మకుంటలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం.

రైతులు పండించిన ప్రతి గింజను రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తూ రైతు పక్షపాతిగా నిలుస్తోందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. భూపతి రెడ్డి అన్నారు. మంగళవారం మోపాల్ మండలం ఎల్లమ్మకుంట గ్రామంలో బాడ్సి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత కాంటా వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి కొనుగోలు ప్రక్రియను ప్రారంభించారు. గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు గ్రామస్థులు బంజారా సంప్రదాయ రీతిలో ఘన స్వాగతం పలికారు.

2



# ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానం

- గ్రామాలకు  సీసీ కెమెరాలతో భద్రత.
- సీపీ సాయిచైతన్య.

ఒక సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమని, గ్రామాలకు సీసీ కెమెరాలతో భద్రత ఉంటుందని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు 'అరైవ్ అలైవ్ - 2026' కార్యక్రమంలో భాగంగా రోడ్ సేఫ్టీ, సైబర్ క్రైమ్ ప్రివెన్షన్, డ్రగ్స్ నియంత్రణ, సీసీటీవీ కెమెరాల ఏర్పాట్లపై సర్పంచ్లకు, కౌన్సిలర్లకు బోధన్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

2

## కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్

# చెక్కుల పంపిణీ

- చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణ రెడ్డి.



కామారెడ్డి నియోజకవర్గం పలు మండలలలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పేద కుటుంబాలకు ఎంతో తోడ్పడుతున్నాయని తెలిపారు. కల్యాణ లక్ష్మి పథకం ద్వారా ఆర్థిక ఇబ్బందులు తగ్గి పేద కుటుంబాల కుమార్తెల వివాహాలు సులభంగా నిర్వహించుకునే అవకాశం కలుగుతుందని అన్నారు.

2

# రైతులు పండించిన ప్రతి గింజ కొనుగోలు చేస్తున్నాం

**- రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి.**
**- ఎల్లమ్మకుంటలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం.**







నిజామాబాద్ రూరల్, ఏప్రిల్ 21 ( మనం న్యూస్ ) : రైతులు పండించిన ప్రతి గింజను రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తూ రైతు పక్షపాతిగా నిలుస్తోందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. భూపతి రెడ్డి అన్నారు. మంగళవారం మోపాల్ మండలం ఎల్లమ్మకుంట గ్రామంలో బాడ్సి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ఘనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత కాంటా వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి కొనుగోలు ప్రక్రియను ప్రారంభించారు. గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు గ్రామస్థులు బంజారా సంప్రదాయ రీతిలో ఘన స్వాగతం పలికారు.

అనంతరం గ్రామంలో నూతనంగా ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి చేసుకున్న సునీత-సుధాకర్ దంపతుల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశం నిర్వహించారు.

తదనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ., రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తండాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. రైతులు పండించిన మొక్కజొన్నను కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయడంలో వెనుకంజ వేస్తే, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలిచి మద్దతు ధరతో పంట కొనుగోలు చేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 739 కొనుగోలు కేంద్రాల ద్వారా పంట కొనుగోలు జరుగుతోందని, మహిళలకు ప్రాధాన్యతనిస్తూ ఐకేపీ సంఘాల ద్వారా కొనుగోలు కేంద్రాలు నిర్వహించే అవకాశం కల్పించామని తెలిపారు.

అర్హులైన ప్రతి పేద కుటుంబానికి రేషన్ కార్డులు, సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, ఇందిరమ్మ ఇళ్ల ద్వారా పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు.

ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాయరెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, మాజీ ఎంపీపీ యాదగిరి, సర్పంచ్ ఫోరం జిల్లా అధ్యక్షుడు మునిపల్లి సాయిరెడ్డి, తారాచంద్ నాయక్, డివిజన్ నం.1 కార్పొరేటర్ అగ్గు భోజన్న, కాంగ్రెస్ నాయకులు అమృతాపూర్ గంగాధర్, ఉమ్మాజీ నరేష్, ప్రతాప్ సింగ్, రాంచందర్ గౌడ్, స్థానిక సర్పంచ్ తిరుపతి, ఆయా గ్రామాల సర్పంచులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానం

**- గ్రామాలకు సీసీ కెమెరాలతో భద్రత.**
**- సీపీ సాయిచైతన్య.**





నిజామాబాద్, ఏప్రిల్ 21 ( మనం జిల్లా ప్రతినిధి ): ఒక సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమని, గ్రామాలకు సీసీ కెమెరాలతో భద్రత ఉంటుందని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు 'అరైవ్ అలైవ్ - 2026' కార్యక్రమంలో భాగంగా రోడ్ సేఫ్టీ, సైబర్ క్రైమ్ ప్రివెన్షన్, డ్రగ్స్ నియంత్రణ, సీసీటీవీ కెమెరాల ఏర్పాట్లపై సర్పంచ్లకు, కౌన్సిలర్లకు బోధన్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ., ప్రపంచంలో ఒక్క యాక్సిడెంట్ జరుగకుండా ఉన్న దేశం ఫిన్లాండ్ అని అన్నారు. వ్యవసాయాదరులు రోడ్లపై ధాన్యం ఆరబెట్టినప్పుడు భద్రత కోన్లు, లేదా బకెట్ పెట్టి స్టిక్కర్లు అంటించాలని, డ్రైవింగ్ చేస్తున్నప్పుడు మొబైల్ ఫోన్లు వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని కోరారు. ప్రతిఒక్కరు ట్రాఫిక్ నియమాలు పాటించాలని, డ్రైవింగ్ చేస్తున్నప్పుడు వాహనాల మధ్య తగినంత దూరం ఉండేటట్లు చూసుకోవాలన్నారు. యువత డ్రగ్స్కు బానిస కాకుండా ప్రతి ఒక్కరూ గమనిస్తూ ఉండాలని, ఆన్లైన్ బెట్టింగ్కు దూరంగా ఉండాలని, రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు, డిఫెన్సివ్ డ్రైవింగ్ పద్ధతులపై అవగాహన కల్పించారు. అధిక వేగం, క్రమశిక్షణ లోపం, అలసటతో వాహనం నడపడం వంటి అంశాలు ప్రమాదాలకు దారితీస్తాయని సీపీ వివరించారు. ఆరోగ్యంపై శ్రద్ధ, కట్టుదిట్టమైన ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. 2020 సంవత్సరంలో కరోనా ఫేస్-1 ఫేస్-2లో నిజామాబాద్ జిల్లాలో దాదాపు 200 మంది మృతి చెందారని, అదే 2025లో రోడ్డు ప్రమాదాల వల్ల దాదాపు 302 మంది మృతి చెందారని వివరించారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, సైబర్ క్రైం ఏసీపీ వెంకటేశ్వరరావు, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, బోధన్ మున్సిపల్ ఛైర్మన్ తూము పద్మ శరత్ రెడ్డి, వైస్ ఛైర్మన్ ఇలియాస్, బోధన్ టౌన్ ఎస్హెచ్వో వెంకటనారాయణ, బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు, రుద్రూర్ సీఐ శ్రీకృష్ణ, బోధన్ ఎంవీఐ శ్రీనివాస్, ఎన్ఎస్సీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సాంబశివరావు, ఎన్ఎస్ఈ మెంబర్స్ దుష్యంత్, కొడాలి కిషోర్, బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్, బోధన్ టౌన్ ఎస్ఐ మనోజ్, రెంజల్ ఎస్ఐ చంద్రమోహన్, కోటగిరి ఎస్ఐ సునీల్, సర్పంచులు కౌన్సిలర్లు వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.



# కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**- చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణ రెడ్డి.**





కామారెడ్డి, ఏప్రిల్ 21 (మనం న్యూస్) : కామారెడ్డి నియోజకవర్గం పలు మండలలలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పేద కుటుంబాలకు ఎంతో తోడ్పడుతున్నాయని తెలిపారు. కల్యాణ లక్ష్మి పథకం ద్వారా ఆర్థిక ఇబ్బందులు తగ్గి పేద కుటుంబాల కుమార్తెల వివాహాలు సులభంగా నిర్వహించుకునే అవకాశం కలుగుతుందని అన్నారు.

**రామారెడ్డి మండలంలో..**

రామారెడ్డి మండలంలోని పలు గ్రామాలకు చెందిన కల్యాణ లక్ష్మి పథకం లబ్ధిదారులకు ఎమ్మెల్యే చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. పాల్వంచ, దోమకొండ, భిక్కనూరు, రాజాంపేట మండలంలోను చెక్కులు పంపిణీ.

పాల్వంచ, దోమకొండ, భిక్కనూరు, రాజాంపేట మండల కేంద్రంలలోని రైతు వేదికలో ఆయా గ్రామాల లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ., ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

**కామారెడ్డి జిల్లా కేంద్రంలో...**

జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణ పరిధిలోని వివిధ వార్డులకు చెందిన కల్యాణ లక్ష్మి మరియు షాది ముబారక్ పథకాల లబ్ధిదారులకు చెక్కులను స్థానిక ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



# సిరికొండలో వడ్ల కొనుగోళ్లపై రైతుల ఆందోళన

**- ప్రారంభించిన కేంద్రంలో కొనుగోళ్లు అలస్యం.. అధికారుల వివరణ.**

నిజామాబాద్ రూరల్, సిరికొండ, ఏప్రిల్ 21 ( మనం న్యూస్ ): సిరికొండ మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని హడావిడిగా ప్రారంభించినప్పటికీ ఇప్పటి వరకు కొనుగోళ్లు సక్రమంగా ప్రారంభం కాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం కురిసిన వడగండ్ల వర్షంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఇప్పటికే కోతకు వచ్చిన ధాన్యం వర్షానికి తడవడంతో నష్టపోతామనే భయంతో ఉన్న రైతులు, ఇప్పటికైనా వడ్ల కాంటా వేయలేదని వాపోయారు. వడ్ల కొనుగోళ్లు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినప్పటికీ అమలు జరగడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. కొనుగోలు కేంద్రాన్ని కొబ్బరికాయ కొట్టి నామమాత్రంగా ప్రారంభించారే తప్ప వాస్తవంగా వడ్లు జోకడం లేదని రైతులు గన్నీ సంచులను చూపిస్తూ అసంతృప్తి వ్యక్తం చేశారు.

**అధికారుల వివరణ**

ఈ విషయంపై ఏపీఎం సువర్ణ స్పందిస్తూ, సిరికొండలో ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మాట వాస్తవమేనని తెలిపారు. అక్కడ గన్నీ సంచులు కూడా సిద్ధంగా ఉంచామని చెప్పారు. హమాలీలు అందుబాటులో లేక కొంత ఇబ్బంది ఏర్పడిందన్నారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి హమాలీలు వచ్చారని, ప్రస్తుతం వడ్ల తూకం ప్రక్రియ ప్రారంభించామని వెల్లడించారు. రైతులు అధైర్యపడవద్దని, ప్రతి రైతు ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని భరోసా ఇచ్చారు.



సీసీ రాజేందర్ మాట్లాడుతూ., మంగళవారం మధ్యాహ్నం నుంచి 500 నుంచి 600 బస్తాల వరకు వడ్లు తూకం వేసినట్లు తెలిపారు. హమాలీల కొరత కారణంగా కొద్దిపాటి ఆలస్యం జరిగిందని అంగీకరించారు.





# మానవత్వం చాటిన ఎస్ఐ

**- ఇంటర్మీడియట్ మండల టాపర్ హారికను అభినందించిన పోలీసులు.**

నాగిరెడ్డిపేట్, ఏప్రిల్ 21 ( మనం న్యూస్ ) : మండలంలోని మాల్తుమ్మెద తండాకు చెందిన హారిక మోడల్ స్కూల్ ఇంటర్మీడియట్లో 970 మార్కులు సాధించిన సందర్భంగా నాగిరెడ్డిపేట్ మండల ఎస్ఐ భార్గవ్ గౌడ్, పోలీస్ సిబ్బంది శాలువతో ఘనంగా సన్మానించారు. హారిక పూరిగుడిసెలో నివసిస్తూ, నిరుపేద కుటుంబం నుంచి వచ్చి, చదువుకోవాలని పట్టుదలతో మండలంలోనే టాపర్గా నిలిచి ఆదర్శమయ్యారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్ఐ భార్గవ్ గౌడ్,పోలీస్ సిబ్బంది అభినందించారు. మండల్ టాపర్ హారికకు ఉద్యోగం వచ్చేవరకు చదువుకు సంబంధించిన ఖర్చులను తాము భరిస్తామని ఎస్ఐ భార్గవ్ గౌడ్ తెలిపారు. ప్రస్తుతం ఎంట్రన్స్ పరీక్షలకు అప్లై చేసుకోవడానికి 3000 రూపాయలు నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.



# గ్రామీణ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య



బీబీపేట, ఏప్రిల్ 21 ( మనం న్యూస్ ) : తిమ్మయ్య గారి సుశీల నారాయణరెడ్డి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బీబీపేటకు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, మాజీ టీఎస్పీఎస్సీ చైర్మన్ జనార్దన్ రెడ్డి మంగళవారం పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతంలో అత్యాధునిక సదుపాయాలతో భవన నిర్మాణం చేపట్టి, గ్రామీణ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు కృషి చేస్తున్న దాత తిమ్మయ్య గారి సుభాష్ రెడ్డిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల భవన నిర్మాణం, అందుబాటులో ఉన్న వసతులు, బోధన పద్ధతులు, విద్యార్థుల పురోగతి వంటి అంశాలపై వివరంగా ఆరా తీశారు. పాఠశాలలో అమలవుతున్న విద్యా కార్యక్రమాలు, సాంకేతిక ఆధారిత బోధన విధానాలు, విద్యార్థుల ప్రతిభ వికాసానికి చేపడుతున్న కార్యక్రమాల గురించి ప్రధానోపాధ్యాయులు మూల రవీంద్రారెడ్డి సమగ్రంగా వివరించారు. అనంతరం విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించిన జనార్దన్ రెడ్డి వారి లక్ష్యాలు, ఆశయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థి సృజన ఐఏఎస్ కావాలంటే ఏం చేయాలి అనే ప్రశ్నకు సమాధానమిస్తూ, నిరంతర సాధన, క్రమశిక్షణ, సమాజ సేవ పట్ల అంకితభావం ఉంటేనే ఉన్నత లక్ష్యాలను సాధించగలమని సూచించారు. పెద్ద కలలు కనడం, వాటిని సాధించేందుకు పట్టుదలతో కృషి చేయడం విద్యార్థుల విజయానికి కీలకమని పేర్కొన్నారు. పదవ తరగతి విద్యార్థిని కుమారి పూర్ణ చందన తన కూచిపూడి నృత్య ప్రదర్శన తో అలరించారు.అత్యాధునిక సదుపాయాలతో రూపొందించిన ఈ పాఠశాల, కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోకుండా ఉండటం అభినందనీయమని, ఈ అవకాశాలను విద్యార్థులు సమర్థవంతంగా వినియోగించుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ దాత తిమ్మయ్య గారి సుభాష్ రెడ్డి, జర్నలిస్ట్ తెలంగాణ విట్టల్, ప్రధానోపాధ్యాయులు మూల రవీంద్రారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ యువత, తదితరులు పాల్గొన్నారు.





# ప్యాడీ కొనుగోలు కేంద్రాలను పరిశీలన

**- పరిశీలించిన రాష్ట్ర సివిల్ సప్లైస్ ప్రధాన కార్యదర్శి అండ్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర.**

**- జిల్లాలో 35,300 మెట్రిక్ టన్నుల ప్యాడీ కొనుగోలు.**

కామారెడ్డి, ఏప్రిల్ 21 (మనం జిల్లా ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లైస్ ప్రధాన కార్యదర్శి అండ్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, మంగళవారం కామారెడ్డి మండలం గర్గుల్ గ్రామంలోని ప్యాడీ ప్రొక్యూర్మెంట్ సెంటర్ (పిపిసిఎస్) మరియు గోకుల్ తాండా పీపీసీ (ఐకెపి)లను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన ఆయన, కొనుగోలు కేంద్రాల పనితీరును సమీక్షించారు. ప్యాడీ కొనుగోలులో భాగంగా పని చేస్తున్న అన్ని శాఖల అధికారులతో సమావేశమై, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. రైతులకు చెల్లింపులు త్వరగా జరగాలంటే ఓపిఎంఎస్ టాబ్లెట్లలో నమోదులను సమయానికి పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 35,300 మెట్రిక్ టన్నుల ప్యాడీ కొనుగోలు జరిగినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్, జిల్లా సివిల్ సప్లైస్ అధికారి, డీఎం (సివిల్ సప్లైస్), డిఆర్డిఓ, డి సి ఓ, డిఎల్ఎమ్ఓ, ఏడి (మార్కెటింగ్) తదితర అధికారులు పాల్గొన్నారు.


# మానవత్వం చాటిన ఎస్ఐ

**- ఇంటర్మీడియట్ మండల టాపర్ హారికను అభినందించిన పోలీసులు.**

నాగిరెడ్డిపేట్, ఏప్రిల్ 21 ( మనం న్యూస్ ): మండలంలోని మాల్తుమ్మెద తండాకు చెందిన హారిక మోడల్ స్కూల్ ఇంటర్మీడియట్లో 970 మార్కులు సాధించిన సందర్భంగా నాగిరెడ్డిపేట్ మండల ఎస్ఐ భార్గవ్ గౌడ్, పోలీస్ సిబ్బంది శాలువతో ఘనంగా సన్మానించారు. హారిక పూరిగుడిసెలో నివసిస్తూ, నిరుపేద కుటుంబం నుంచి వచ్చి, చదువుకోవాలని పట్టుదలతో మండలంలోనే టాపర్గా నిలిచి ఆదర్శమయ్యారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్ఐ భార్గవ్ గౌడ్,పోలీస్ సిబ్బంది అభినందించారు. మండల్ టాపర్ హారికకు ఉద్యోగం వచ్చేవరకు చదువుకు సంబంధించిన ఖర్చులను తాము భరిస్తామని ఎస్ఐ భార్గవ్ గౌడ్ తెలిపారు. ప్రస్తుతం ఎంట్రన్స్ పరీక్షలకు అప్లై చేసుకోవడానికి 3000 రూపాయలు నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.




# భిక్కనూర్లో తీరిన లో-వోల్టేజ్ కష్టాలు

**- రంగంలోకి దిగిన విద్యుత్ శాఖ అధికారులు**

భిక్కనూర్, ఏప్రిల్ 21 ( మనం న్యూస్ ): స్థానిక విద్యుత్ సమస్యల పరిష్కారానికి అధికారులు వేగంగా స్పందిస్తున్నారు. ఇటీవల భిక్కనూర్లో నిర్వహించిన స్పెషల్ గ్రామసభల్లో వెల్లడైన సమస్యలపై విద్యుత్ శాఖ అధికారులు తక్షణ చర్యలు చేపట్టారు. గ్రామసభలో సమస్య ప్రస్తావన ఉన్న జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న ట్రాన్స్ఫార్మర్ కారణంగా ఆ ప్రాంతంలో గత కొంతకాలంగా లో-వోల్టేజ్ సమస్య తీవ్రంగా ఉందని బిజెపి మండల అధ్యక్షుడు ఉప్పరి రమేష్ గ్రామసభ దృష్టికి తీసుకొచ్చారు. అలాగే ట్రాన్స్ఫార్మర్కు ఏబి స్విచ్ లేకపోవడం వల్ల అత్యవసర సమయాల్లో విద్యుత్ నిలిపివేతకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన ఏఈ సంకీర్త్ వివరించారు.

**క్షేత్రస్థాయిలో చర్యలు....**

ఈ ఫిర్యాదుపై వెంటనే స్పందించిన విద్యుత్ శాఖ ఏఈ సంకీర్త్ మంగళవారం సిబ్బందితో కలిసి



క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ట్రాన్స్ఫార్మర్ వద్ద విద్యుత్ లోడ్ బ్యాలెన్సింగ్ను సరిచేసి, లో-వోల్టేజ్ సమస్యను నివారించారు.

అనంతరం ఏఈ మాట్లాడుతూ.. ఈ ప్రాంత ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని త్వరలోనే కొత్తగా ఏబి స్విచ్ను కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. తమ సమస్యపై సానుకూలంగా స్పందించి పరిష్కరించినందుకు పట్టణ ప్రజలు మరియు ఉప్పరి రమేష్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఏఈ సంకీర్తతో పాటు లైన్మెన్ మాణిక్యం, వేణు మరియు ఉప్పరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## అదుపు తప్పి ఆటో బోల్తా

**- తృటిలో తప్పిన ప్రమాదం.**

రుద్రూర్, ఏప్రిల్ 21 ( మనం న్యూస్ ) : ప్రమాదవశాత్తు అదుపుతప్పి ఆటో బోల్తా పడిన ఘటన మంగళవారం సాయంత్రం రుద్రూర్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. టిఎస్16యుబి 2724 నెంబర్ గల ఆటో వర్ని నుండి రుద్రూర్ వైపుకు వస్తుండగా అక్బర్ నగర్ వద్ద ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తా పడింది. ఆటోలో ఉన్న సుమారు ఐదుగురికి స్వల్ప గాయాలు కాగా ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 అంబులెన్సులో క్షతగాత్రులను బోధన్ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన్నట్లు స్థానికులు పేర్కొన్నారు.

## భిక్నూర్ మండలంలో ప్రైమరీ పాఠశాలలకు కొత్త శోభ

భిక్నూర్, ఏప్రిల్ 21 ( మనం న్యూస్ ); భిక్నూర్ మండలంలోని దాదాపు 15 ప్రైమరీ పాఠశాలలకు కొత్తగా రంగులు వేస్తున్నామని మండల విద్యాధికారి  తెలిపారు. ఈ చర్యతో ఈ పాఠశాలలకు కొత్త శోభ రానుంది. పాఠశాలలను మరింత ఆకర్షణీయంగా మరియు విద్యార్థులకు అనుకూలంగా మార్చడంపై అధికారులు దృష్టి సారించారు. దీంతో పాటు, మండల విద్య వ్యవస్థను గాడిన పెట్టేందుకు మండల విద్యాధికారి రాజ్ గంగా రెడ్డి ఆకస్మిక తనిఖీలను కూడా నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీల ద్వారా ఉపాధ్యాయుల హాజరు, బోధనా విధానం, పాఠశాల నిర్వహణ మరియు ఇతర





సౌకర్యాలను పర్యవేక్షిస్తున్నారు. లోపాలను గుర్తించిన వెంటనే సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేస్తున్నారు. రాజ్ గంగా రెడ్డి ఈ విధంగా మండలం లోని విద్య వ్యవస్థ లో మార్పులు తీసుకురావడం స్థానిక ప్రజలు, విద్యార్థులు కూడా అభినందిస్తున్నారు. దీని వల్ల విద్యార్థుల కు మంచి భవిష్యత్ ఇవ్వడానికి వీలు పడుతుందని వారు ఆశిస్తున్నారు. సమస్త ప్రజలకి విద్య ను అందించడం లో భిక్నూర్ మండల అధికారులు సఫలం అవ్వాలి అని వారు కోరుతున్నారు.




## నేరాల నివారణకు ప్రజల అప్రమత్తత అవసరం

**- కామారెడ్డి పట్టణ సీఐ నరహరి పలు సూచనలు.**

కామారెడ్డి, ఏప్రిల్ 21 (మనం న్యూస్) : కామారెడ్డి పట్టణంలో ఇటీవల ఇళ్ల దొంగతనాలు, గొలుసు లాగింపులు, వాహనాల దొంగతనాలు వంటి ఆస్తి సంబంధిత నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కామారెడ్డి పట్టణ సీఐ నరహరి సూచించారు. వ్యక్తిగత జాగ్రత్తలతోనే ఇటువంటి నేరాలను గణనీయంగా తగ్గించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఇంటి భద్రత విషయంలో నిర్లక్ష్యం చేయకూడదని, బయటకు వెళ్లే సమయంలో తలుపులు, కిటికీలకు పటిష్టంగా తాళాలు వేసుకోవాలని సూచించారు. బంగారు నగలు, నగదు వంటి విలువైన వస్తువులను నిర్లక్ష్యంగా ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వీలైనంత వరకు ఇండ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాల నియంత్రణకు దోహదపడుతుందని చెప్పారు.

**మీ సహకారం - మా భద్రత.**
**జాగ్రత్తలు తీసుకోండి - సురక్షితంగా ఉండండి.**

సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్త అవసరమని, ప్రయాణ వివరాలు లేదా ఇంట్లో ఎవరూ లేరనే సమాచారం పంచుకోవడం వల్ల దొంగలకు అవకాశం కలుగుతుందని హెచ్చరించారు. వాహనాలను ఎల్లప్పుడూ సురక్షిత ప్రదేశాల్లో పార్క్ చేయాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఏదైనా అనుమానాస్పద పరిస్థితి గమనించిన వెంటనే 100 నంబర్కు కాల్ చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతోనే నేరాల నివారణ సాధ్యమని, అప్రమత్తతతో ముందుకు సాగాలని ప్రజలను సీఐ కోరారు.



## రేకులపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం

**- ఎమ్మెల్యే భూపతి రెడ్డికి గ్రామస్థుల ప్రత్యేక కృతజ్ఞతలు.**

నిజామాబాద్ రూరల్, ఏప్రిల్ 21 ( మనం న్యూస్ ): నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని ధర్పల్లి మండలం రేకులపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామ ప్రజల దీర్ఘకాలిక కోరిక నెరవేరడంతో ఆనందం వ్యక్తం చేస్తూ ఇందుకు కృషి చేసిన నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రాజేందర్, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణతో పాటు పలువురు గ్రామస్థులు ఎమ్మెల్యేను కలిసి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

అనంతరం గ్రామానికి సంబంధించిన పలు అభివృద్ధి అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామ ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు గ్రామస్థులు తెలిపారు.

# అదుపు కోల్పోయిన ఆధునిక జీవితం

**- బానిసలవుతున్న మనుషులు.**







మెండోరా, ఏప్రిల్ 22 ( మనం న్యూస్ ): నేటి ఆధునిక సమాజంలో మనుషుల జీవన విధానం పూర్తిగా మారిపోయింది. సాంకేతికత అభివృద్ధి, వేగవంతమైన జీవనశైలి మనుషులకు సౌలభ్యాన్ని అందించినప్పటికీ, అదే సమయంలో వారిని అనేక విషయాలకు బానిసలుగా మారుస్తోంది. ముఖ్యంగా మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా, డబ్బు, విలాసవంతమైన జీవితం వంటి అంశాలు మనుషులపై గాఢమైన ప్రభావం చూపుతున్నాయి. ప్రస్తుతం చాలా మంది తమ రోజువారీ జీవితాన్ని మొబైల్ ఫోన్ చుట్టూనే తిరుగుతున్నట్లుగా కనిపిస్తున్నారు. ఉదయం లేవగానే మొదలుకొని రాత్రి పడుకునే వరకు ఫోన్ చేతిలోనే ఉంటుంది. సోషల్ మీడియా ప్లాట్ఫార్మ్లలో గంటల కొద్దీ గడిపే అలవాటు పెరుగుతోంది. దీనివల్ల కుటుంబ సంబంధాలు బలహీనపడుతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇక డబ్బు పట్ల మక్కువ కూడా పెరిగింది. సంపాదన కోసం పరుగు పెడుతూ, ఆరోగ్యం, సంబంధాలు, మానవ విలువలను పక్కన పెట్టే పరిస్థితి నెలకొంది. విలాసవంతమైన జీవితం కోసం అప్పులు చేయడం, అవసరానికి మించిన ఖర్చులు చేయడం సాధారణమవుతోంది. మరోవైపు వినోదానికి కూడా పరిమితి లేకుండా పోయింది. గేమ్స్, సినిమాలు, సీరియల్స్ వంటి వాటికి బానిసలై, తమ సమయాన్ని వృథా చేసుకుంటున్నారు యువత. దీనివల్ల చదువు, ఉద్యోగం, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలు ప్రభావితమవుతున్నాయి. సమాజ శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం, ఈ బానిసత్వం నుంచి బయటపడాలంటే మనుషులు తమపై తాము నియంత్రణ పెంచుకోవాలి. సాంకేతికతను అవసరానికి మాత్రమే ఉపయోగించాలి. కుటుంబంతో గడిపే సమయాన్ని పెంచడం, ఆరోగ్యంపై దృష్టి పెట్టడం చాలా అవసరం. సాంకేతికత మన జీవితాన్ని సులభం చేయాలి గానీ, మనల్ని నియంత్రించకూడదు. లేదంటే మనుషులు యంత్రాలకే బానిసలైపోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



# అంబేద్కర్ నగర్లో ఘనంగా 'సంవిధాన్' పంపిణీ

**- సర్పంచ్ వాగ్మారె మాధవ్ చేతుల మీదుగా నాయకులకు అందజేత.**

**- ప్రజల్లో రాజ్యాంగంపై అవగాహన పెంపే లక్ష్యం.**

రెంజల్, ఏప్రిల్ 21 ( మనం న్యూస్) : రెంజల్ మండలంలోని అంబేద్కర్ నగర్ గ్రామంలో అంబేద్కర్ జయంతి సందర్భంగా సోమవారం 'సంవిధాన్' ప్రతులను ఘనంగా పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ వాగ్మారె మాధవ్ చేతుల మీదుగా కాంగ్రెస్ మండల అధ్యక్షులు మొబిన్ ఖాన్, సాయరెడ్డి, ఆసాని అనిల్, బోగిడి రవి, నీరడీ రవి, నీరడీ ఈశ్వర్ తదితరులకు రాజ్యాంగ ప్రతులను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వాగ్మారె మాధవ్ మాట్లాడుతూ., డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం దేశానికి మార్గదర్శకమని, ప్రతి ఒక్కరూ రాజ్యాంగ విలువలను పాటించాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వందన భాయ్, జాదవ్ రాము మరియు గ్రామ నాయకులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సెన్సస్-2027 శిక్షణ కార్యక్రమం విజయవంతం

నిజామాబాద్ రూరల్, ఏప్రిల్ 21 ( మనం న్యూస్ ): జక్రాన్పల్లి మండలానికి చెందిన ఉపాధ్యాయ బృందం సెన్సస్-2027కు సంబంధించి నిర్వహించిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ శిక్షణలో సెన్సస్ కార్యక్రమానికి సంబంధించిన ముఖ్యాంశాలు, ప్రత్యేకతలు, నిర్వహణ విధానాలపై ఉపాధ్యాయులు సమగ్ర అవగాహన పొందారు. ఈ సందర్భంగా మండల చార్జ్ ఆఫీసర్ కిరణ్మయి మాట్లాడుతూ., ఈసారి హెచ్ఎల్బీ యాప్ ద్వారా సెన్సస్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామంలో ఒక్క ఇంటిని కూడా వదలకుండా సర్వే పూర్తి చేయాలని సూచించారు. అడిషనల్ చార్జ్ ఆఫీసర్గా వ్యవహరిస్తున్న మండల విద్యాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ., సెన్సస్-2027లో భాగస్వామ్యం కావడం గౌరవకరమైన విషయమన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో సూపర్వైజర్ల సహకారంతో ఎన్యుమరేటర్లు సమర్థవంతంగా పనిచేసి మండలానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. శిక్షణ కార్యక్రమంలో ఆర్పీలుగా వ్యవహరించిన పొలాస రాములు, భార్గవ్ ఉపాధ్యాయులకు సెన్సస్ విధానంపై సమగ్ర శిక్షణ అందించారు. శిక్షణను విజయవంతంగా నిర్వహించినందుకు వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లుగా తమ బాధ్యతలను తెలుసుకుంటూ చురుకుగా పాల్గొన్నారు. శిక్షణ పొందిన ఎన్యుమరేటర్లు మే 11వ తేదీ నుంచి ప్రారంభమయ్యే సెన్సస్ కార్యక్రమాన్ని గ్రామాల్లో విజయవంతంగా నిర్వహించాలని సంకల్పించారు.

చివరగా శిక్షణ అందించిన ఫీల్ ట్రైనర్లను ఘనంగా సన్మానించారు. సెన్సస్లో పాల్గొనే వారందరూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చార్జ్ ఆఫీసర్ కిరణ్మయి, అడిషనల్ చార్జ్ ఆఫీసర్ శ్రీనివాస్ కోరారు.






# తెలంగాణ వర్సిటీ డిగ్రీ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహణ

**- 29 కేంద్రాల్లో 6,382 మంది హాజరు.**

నిజామాబాద్ రూరల్, ఏప్రిల్ 21 ( మనం న్యూస్ ) : తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలో డిగ్రీ రెగ్యులర్, బ్యాక్లాగ్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయని అకడెమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య గంట చంద్రశేఖర్ తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిధిలో మొత్తం 29 పరీక్షా కేంద్రాల్లో 6,631 మంది అభ్యర్థులకు గాను 6,382 మంది హాజరయ్యారని, 248 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు. ఒక అభ్యర్థిని డిబార్ చేసినట్లు తెలిపారు.

ఉదయం నిర్వహించిన ఆరో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షకు 4,887 మంది అభ్యర్థులకు గాను 4,745 మంది హాజరుకాగా, 142 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన మొదటి సెమిస్టర్ బ్యాక్లాగ్ పరీక్షకు 1,744 మంది అభ్యర్థులకు గాను 1,637 మంది హాజరుకాగా, 106 మంది గైర్హాజరయ్యారు. ఆర్మూర్లో ఒక అభ్యర్థిని డిబార్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిజామాబాద్ నగరంలోని పలు పరీక్షా కేంద్రాలను తెలంగాణ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య టి. యాదగిరి రావు పరిశీలించి పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు.

# తెలంగాణ విశ్వవిద్యాలయ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా గోరటి వెంకన్న

**- పాటలతో విద్యార్థులను ఉత్తేజపరచనున్న ప్రజావాగ్గేయకారుడు.**



నిజామాబాద్ రూరల్, ఏప్రిల్ 21 ( మనం న్యూస్ ) : తెలంగాణ విశ్వవిద్యాలయంలో నేడు నిర్వహించనున్న యూనివర్సిటీ వార్షికోత్సవ సభకు ఎమ్మెల్సీ, ప్రజావాగ్గేయకారుడు, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత గోరటి వెంకన్న ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని వర్సిటీ ఉపకులపతి ఆచార్య టి. యాదగిరిరావు తెలిపారు. సాయంత్రం జరగనున్న ఈ వార్షికోత్సవ సభలో గోరటి వెంకన్న విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించనున్నారని పేర్కొన్నారు. అలాగే తన స్ఫూర్తిదాయకమైన పాటలతో విద్యార్థుల్లో ఉత్తేజం నింపనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పెద్ద ఎత్తున హాజరుకావాలని వర్సిటీ అధికారులు కోరారు.



## పాడే మోసిన ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు

బిచ్కుంద, ఏప్రిల్ 21 ( మనం న్యూస్ ): బిచ్కుంద మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు స్వర్గీయ మల్లికార్జున్ అప్ప షెట్కార్ సతీమణి గిరిజ మల్లికార్జున్ అప్ప షెట్కార్ పరమపదించారు. ఈ విషయం తెలుసుకున్న జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు మంగళవారం బిచ్కుందకు చేరుకుని వారి భౌతిక కాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజ మల్లికార్జున్ అప్ప షెట్కార్ మరణం ఎంతో దురదృష్టకరం మరియు బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం అంతిమ యాత్రలో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు.

## రక్తదాతలకు హెల్మెట్లు, ఐవిఎఫ్ రక్తదాతల సమూహ సేవలకు ప్రశంసలు

**– ముఖ్యఅతిథిగా జిల్లా న్యాయ సేవాధికారిక సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ నాగరాణి.**

కామారెడ్డి, ఏప్రిల్ 21 ( మనం న్యూస్ ): డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొన్న రక్తదాతలను జిల్లా న్యాయ సేవాధికారిక




సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ నాగరాణి హెల్మెట్లు, ప్రశంసాపత్రాలతో సత్కరించారు. కామారెడ్డి రక్తదాతల సమూహం, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవిఎఫ్), ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం సంయుక్తంగా ఈ శిబిరాన్ని నిర్వహించాయి.

### రక్తదాతలు ప్రాణదాతలే..

ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ., రక్తదాతలు ప్రాణదాతలేనని పేర్కొన్నారు. మహనీయుల జయంతుల సందర్భాల్లో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సామాజిక సేవలో ముందుండే డాక్టర్ బాలను ప్రత్యేకంగా అభినందించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఐవిఎఫ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు, జిల్లా అధ్యక్షుడు ఎర్రం చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి దొంతి సుధాకర్, కోశాధికారి కస్వ వెంకటేష్, ఆధ్యాత్మిక విభాగం అధ్యక్షుడు ఎల్లంకి సుదర్శన్, ప్రధాన కార్యదర్శి ఎర్రం విజయ్ కుమార్, యువజన విభాగం అధ్యక్షుడు ఎర్రం ఈశ్వర్, కొమిరిశెట్టి గంగరాజం, అర్వపల్లి రమేష్, కూర దిగంబర్, తాటిపాముల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# అధికార గర్వం.. నిబంధనలకు తిలోదకాలు

**జంగంపల్లి పంచాయతీ కార్యదర్శి 'చక్రం'..!**
**బాబు హయాంలో ఆస్తి మార్పిడి వ్యవహారంలో భారీ అవకతవకలు..**




భిక్నూర్, ఏప్రిల్ 21 ( మనం న్యూస్ ) : ఆయనో ప్రభుత్వ ఉద్యోగి.. ప్రజలకు సేవ చేయాలి, నిబంధనలను గౌరవించాలి. కానీ, ఆ మండలంలో ఆయన రూటే వేరు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలన్నా, ప్రజావాణి ఫిర్యాదులన్నా ఆయనకు లెక్కలేదు. 'తానే రాజు.. తానే మంత్రి' అన్న చందంగా వ్యవహరిస్తూ, సామాన్యుల హక్కులను కాలరాస్తున్న జంగంపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి తీరు ఇప్పుడు మండలంలో హాట్ టాపిక్గా మారింది. వివరాల్లోకి వెళ్తే., పుల్గం వెంకయ్య అనే వ్యక్తికి ముగ్గురు కుమారులు ఉన్నారు. తండ్రి పేరు మీద ఉన్న ఆస్తిని ముగ్గురు కొడుకులకు సమానంగా పంపిణీ చేయాల్సి ఉండగా, పంచాయతీ కార్యదర్శి మాత్రం నిబంధనలకు విరుద్ధంగా కేవలం ఒక్క కుమారుడి పేరు మీదకే ఆస్తి మార్పిడి చేశారు. ఈ అన్యాయంపై మిగతా ఇద్దరు సోదరులు జిల్లా అధికారులను ఆశ్రయించారు.

### ఉన్నతాధికారుల ఆదేశాలకే దిక్కులేదు...

బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన జిల్లా పంచాయతీ అధికారి, ఆస్తిని ముగ్గురు సోదరులకు సమానంగా కానీ లేదా వెంకయ్య పేరు పైనే ఉంచాలి అని ఆదేశించారు. అయితే, 'నాకు నచ్చినట్టే చేస్తా.. ఎవరి ఆదేశాలూ నా దగ్గర పని చేయవు' అంటూ సదరు కార్యదర్శి బాధితులను చులకనగా చూస్తూ, ఉన్నతాధికారుల ఉత్తర్వులను బుట్టదాఖలు చేయడం గమనార్హం.

### చెక్కుల విత్ డ్రా.. చట్ట విరుద్ధ చర్యలు!

ఈ కార్యదర్శిపై కేవలం ఆస్తి మార్పిడి వ్యవహారమే కాకుండా ఆర్థిక అవకతవకల ఆరోపణలు కూడా వెల్లువెత్తుతున్నాయి. గ్రామ పంచాయతీకి సంబంధించిన నిధులను, నిబంధనలకు విరుద్ధంగా తన సొంత పేరు మీద చెక్కుల రూపంలో డ్రా చేసినట్లు సమాచారం. గతంలోనూ ఇతని ప్రవర్తన కారణంగా కొంతకాలం పక్కన పెట్టినప్పటికీ మళ్ళీ అదే తీరును కొనసాగించడం వెనుక బలమైన రాజకీయ శక్తుల హస్తం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### మండల అధికారి తీరుపై విస్మయం..

ప్రజలకు న్యాయం చేయాల్సిన మండల స్థాయి అధికారులు కూడా, తప్పు చేసిన కార్యదర్శిని మందలించాల్సింది పోయి, ఆయనకే వంత పాడుతుండడం దురదృష్టకరం.

### న్యాయం కోసం మళ్ళీ ప్రజావాణికి..

అధికారుల నిర్లక్ష్యం, కార్యదర్శి అహంకారపూరిత వైఖరితో విసిగిపోయిన బాధితులు సోమవారం మరోసారి 'ప్రజావాణి' లో ఫిర్యాదు చేశారు. తమకు రావాల్సిన న్యాయమైన వాటాను ఇప్పించాలని, నిబంధనలు అతిక్రమించిన కార్యదర్శిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు వేడుకుంటున్నారు. ప్రభుత్వ యంత్రాంగం ప్రజల కోసం పని చేయాలి కానీ, వ్యక్తిగత స్వార్థం కోసం కాదు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి జంగంపల్లి పంచాయతీలో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## అట్టహాసంగా కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



భిక్కనూర్, ఏప్రిల్ 21 ( మనం న్యూస్ ): భిక్కనూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం కళ్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్ పథకాల కింద 77 మంది లబ్ధిదారులకు కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణ రెడ్డి చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో సునీత, ఎంపీడీవో కిరణ్ కుమార్ రెడ్డి, పశు వైద్యాధికారి దేవేందర్ , బిజెపి మండల అధ్యక్షులు ఉప్పరి రమేష్, లక్ష్మీదేంపల్లి గ్రామ సర్పంచ్ జె లింగారెడ్డి, అంతంపల్లీ ఉపసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, మండల జనరల్ సెక్రెటరీ తిరుమలేష్, పొన్నాల రంజిత్, ఉపాధ్యక్షులు నరేందర్, నర్సింహులు, సీనియర్ రెడ్డి గారి రమేష్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచ్లు, ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు, నాయకులు, గ్రామ అధ్యక్షులు మరియు బిజెపి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి మాట్లాడుతూ., రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్ పథకాలు పేద ప్రజలకు ఎంతో ఆసరాగా నిలుస్తున్నాయని అన్నారు. ఈ పథకాల కింద లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించడం ద్వారా, వారి కుటుంబాలకు కొంత వరకు ఊరట లభిస్తుందని ఆయన తెలిపారు. అలాగే, ఈ పథకాల అమలును పర్యవేక్షించడంలో అధికారులు మరియు ప్రజా ప్రతినిధులు క్రియాశీలకంగా వ్యవహరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు తమకు అందిన చెక్కులపై సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకాలు తమకు ఎంతో సహాయపడ్డాయని, ఈ పథకాల వల్ల తమ కుటుంబాలకు ఆర్థికంగా ఊరట లభించిందని వారు తెలిపారు.

## హిందూ సమ్మేళనం వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

రుద్రూర్, ఏప్రిల్ 21 ( మనం న్యూస్ ): రుద్రూర్ మండలంలోని రాయకూర్ గ్రామంలో ఈ నెల 27న (సోమవారం) నిర్వహించనున్న 'హిందూ సమ్మేళనం' వాల్ పోస్టర్లను మంగళవారం సులేమాన్ నగర్, చిక్కడపల్లి గ్రామాల్లో హిందూ సంఘాల నాయకులు విడుదల చేశారు. ఈ సమ్మేళనంలో మల్లారం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ బాలయోగి కృష్ణ మహారాజ్ పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. హిందూ సోదరులందరూ ఈ వేడుకకు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిక్కడపల్లి సర్పంచ్ మచ్కురి రమేష్, సుధాకర్ గౌడ్, అనీల్ పటేల్, యువకులు తదితరులు పాల్గొన్నారు.



# గర్గుల్లో పలు సేవా కార్యక్రమాలు

**- ప్రజలు సామాజిక బాధ్యతగా సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి.**
**- పీపుల్ ఫర్ ఇండియా, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గర్గుల్లో సేవా కార్యక్రమాలు.**
**- ముఖ్య అతిథులుగా జిల్లా అదనపు కలెక్టర్ మధుమోహన్, రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ డా. ఎం జైపాల్ రెడ్డి.**

కామారెడ్డి, ఏప్రిల్ 21 ( మనం న్యూస్ ) : పిఎఫ్ఐ గర్గుల్ స్వచ్ఛంద సంస్థ మరియు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గర్గుల్ సెంటర్లో మంగళవారం కుట్టు మిషన్లు, వీల్చైర్లు, కంప్యూటర్ ట్రైనింగ్ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు కుట్టు మిషన్లు, దివ్యాంగులకు ఉపశమనం కలిగించేందుకు వీల్చైర్లు అందించారు.

**సామాజిక సేవలో రోటరీ క్లబ్.**




కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అదనపు కలెక్టర్ మధుమోహన్, రోటరీ క్లబ్ ఆఫ్ కామారెడ్డి అసిస్టెంట్ గవర్నర్ డా. ఎం జైపాల్ రెడ్డి హాజరై మాట్లాడుతూ., రోటరీ క్లబ్ సామాజిక సేవలో ఎప్పుడూ ముందుంటుందని, పీపుల్ ఫర్ ఇండియా వంటి సంస్థల సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలు అభినందనీయమని తెలిపారు. వీటి ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు, దివ్యాంగులకు ఉపశమనం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రజలు సామాజిక బాధ్యతగా ఇలాంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ ఆనంద్ రావు, సర్పంచ్ దివ్య, పిఎఫ్ఐ వైస్ ప్రెసిడెంట్ అరవింద్, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ శంకర్, అనిల్, నవీన్, కాశీనాథం, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.




# అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్‌ఫోన్‌లు పంపిణీ



**- మాతా శిశు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట.**
**- రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి.**



నిజామాబాద్ రూరల్, ఏప్రిల్ 21 ( మనం న్యూస్ ) : నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. భూపతి రెడ్డి అంగన్వాడి టీచర్లకు ఫోన్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ., అంగన్వాడీ కేంద్రాలు గ్రామీణ స్థాయిలో మాతా శిశు సంక్షేమానికి కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. పిల్లలతో నిత్యం మమేకమై ఉండే అంగన్వాడీ టీచర్లు తమ పిల్లలుగా భావించి సేవాభావంతో పనిచేయాలని సూచించారు. డీంగల్ ప్రాజెక్టు సిడీపీవో స్వర్ణలత, ఏసీడీపీవో జ్ఞానేశ్వరి ఆధ్వర్యంలో మంగళవారం సిరికొండ మండల అంగన్వాడీ టీచర్లకు ప్రభుత్వం అందజేస్తున్న స్మార్ట్ఫోన్లను ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 72 మంది అంగన్వాడీ టీచర్లు, ఇద్దరు సూపర్వైజర్లకు స్మార్ట్ఫోన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ., రాష్ట్ర ప్రభుత్వం మాతా శిశు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. వాటిని సమర్థవంతంగా ప్రజలకు చేరవేయాల్సిన బాధ్యత అంగన్వాడీ సిబ్బందిపై ఉందన్నారు.

పిల్లలు, గర్భిణీ స్త్రీలకు అందించే పౌష్టికాహారంలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఇప్పటికే నియోజకవర్గంలో 26 నూతన అంగన్వాడీ భవనాలు మంజూరు చేశామని, అవసరమైతే రానున్న రోజుల్లో మరిన్ని భవనాలు కూడా మంజూరు చేయిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ రాంబాబు, సూపర్వైజర్లు సవిత, రాజేశ్వర్, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# జీవితంపై విరక్తి పొంది వ్యక్తి ఆత్మహత్య

బిచ్కుంద, ఏప్రిల్ 21 ( మనం న్యూస్ ): బిచ్కుంద మండలం పత్తలాపూర్ గ్రామానికి చెందిన తుప్పల్వార్ విశ్వనాథ్కు, వినోద (25)తో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఏడాది వయసున్న కూతురు ఉంది. అయితే, గత కొంతకాలంగా విశ్వనాథ్ మద్యానికి బానిస కావడంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో జనవరిలో కూతురి పుట్టినరోజు వేడుక ముగిసిన అనంతరం, భర్త ప్రవర్తనతో విసిగిపోయిన వినోద తన కూతురిని తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది.

వినోద తన వద్దకు తిరిగి రాకపోవడం, ఒంటరితనం వేధించడంతో విశ్వనాథ్ తీవ్ర మనస్తాపానికి లోనయ్యాడు. ఈ క్రమంలో ఏప్రిల్ 20వ తేదీ రాత్రి తన ఇంట్లోని దూలానికి టవల్తో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బాధిత భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు బిచ్కుంద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని ఎస్ఐ రాజు తెలిపారు.

# వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి

నిజామాబాద్, ఏప్రిల్ 21 ( మనం బ్యూరో ): నిజామాబాద్ జిల్లా బోధన్ మండలంలోని ఏరాజ్పల్లి గ్రామంలో వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి చెందిన ఘటన వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం., గ్రామానికి చెందిన ఎరుకలి నర్సయ్య (51) గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులకు వెళ్లాడు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో నర్సయ్యకు తీవ్ర దాహం ఏర్పడింది. నీళ్లు తాగిన అనంతరం ఆయన అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే స్థానికులు వైద్య సిబ్బందికి సమాచారం అందించి, ప్రాథమిక చికిత్స అందించి అంబులెన్స్లో ఆసుపత్రికి తరలించారు. అయితే మార్గమధ్యలోనే నర్సయ్య మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు, ముఖ్యంగా కూలీలకు తగిన అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వడగాల్పుల ప్రభావం నుంచి రక్షణ కోసం ప్రజలకు ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.




# అదనపు డీసీపీ బస్వా రెడ్డికి ఘన వీడ్కోలు సన్మానం

**నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం.**

నిజామాబాద్, ఏప్రిల్ 21 (మనం జిల్లా ప్రతినిధి ): నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో అదనపు డీసీపీ (అడ్మిన్) బస్వా రెడ్డి బదిలీపై వెళ్తున్న సందర్భంగా నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఘన అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ., బస్వా రెడ్డి సేవలను ప్రశంసించారు. పోలీస్ శాఖలో ఆయన చేసిన కృషి, సమర్థవంతమైన పరిపాలన, ప్రజల భద్రత కోసం చేపట్టిన చర్యలు ప్రశంసనీయమన్నారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసిన ఆయన భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ అధికారులు, నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సభ్యులు పాల్గొని బస్వా రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# 9 మంది పేకాట రాయుళ్ల అరెస్ట్

**- రూ. 3,750 నగదు, 4 మొబైల్ ఫోన్లు, ఒక బైక్ స్వాధీనం.**

కామారెడ్డి, ఏప్రిల్ 21 ( మనం క్రైమ్ ): కామారెడ్డి జిల్లాలోని మాచారెడ్డి, కామారెడ్డి పరిధిలో పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు చేసి 9 మంది జూదరులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి నగదు, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలో జూదం, పేకాట వంటి అక్రమ సామాజిక రుగ్మతలను రూపు మాపడమే లక్ష్యంగా పోలీస్ యంత్రాంగం నిరంతర నిఘా కొనసాగిస్తోందని ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. మంగళవారం జిల్లాలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు మెరుపు దాడులు నిర్వహించి మొత్తం 9 మంది పేకాటగాళ్లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మాచారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని చుక్కాపూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న నలుగురిని పట్టుకొని, వారి వద్ద నుంచి రూ. 3,750 నగదు, 4 మొబైల్ ఫోన్లు, ఒక బైక్ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా కామారెడ్డి పట్టణంలోని ఇంద్రానగర్ కాలనీలో నిర్వహించిన తనిఖీల్లో ఐదుగురిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ. 7,590 నగదు, 5 మొబైల్ ఫోన్లు, ఒక ఆటోను సీజ్ చేశారు. ఈ రెండు ఘటనలపై సంబంధిత పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.